

# అద్దం

ఒకానొక దినం, మిట్టమధ్యాహ్న సమయంలో —

మా శ్రీమతి, చిరంజీవి సౌభాగ్యవతి మహాలక్ష్మి ఇంటి ముందు రిక్షా దిగింది. పుట్టింటినుండి నిరాడంబరంగా హాండ్‌బాగ్‌తో తిరిగివచ్చే శ్రీమతి ఈసారి ఏదో పెద్ద వస్తువే తెచ్చింది. రెండు అడుగులు పొడవు, సుమారు అంతే వెడల్పు వున్న దళసరి వస్తువేదో గోనెపట్టాతో కట్టి తెచ్చింది. జాగ్రత్తకోసం చుట్టూ గడ్డి కూడా కూరినట్లుంది. ఒకటి అరా

పరకలు బయటకు తొంగిచూస్తున్నాయి. రిక్షా దిగుతూ జాగ్రత్తగా దింపు ఒబ్బీ" అంటూ రిక్షావాడికి పురమాయించింది. వాడు దాన్ని దింపబో తుంటే "జాగ్రత్తసుమీ" అంటూ రెండు పర్యాయాలు హెచ్చరించింది.

ఈ తతంగమంతా నేను వీధి వరండాలో నిలబడి చూస్తున్నాను. వరండా మెట్లెక్కుతూ ఉంటే "ఏమిటి మోసుకొచ్చావ్? మీ అమ్మ మైసూర్‌పాక్ చేసి ఇచ్చిందా ఏమిటి?" అన్నాను నవ్వుతూ.

ఒకసారి మా అత్తగారు పంపిన జంతికలు తినటంలో మిగిలిన ఘోరమయిన అనుభూతి నేనింకా మరిచిపోలేదు. రాత్రి జంతికలు టేబిలు మీద వదిలేస్తే ఎలుకలు దాన్ని తినటానికి ప్రయత్నించి విఫలమయిన ఉదంతం ఆ మరుసటి దినం బయటపడింది. టేబిలుకింద ఒక ఎలిక చచ్చి పడి ఉంది. "చూశావా? జంతిక తినలేక ఎలిక చచ్చింది" అన్నాను- తోక పట్టుకొని దాన్ని అవతల పారేస్తూ. చాల్లెండి. నేను రాత్రి ఎలిక మందు పెట్టాను. హమ్మయ్య. ఒక బుల్లిముండ చచ్చిందన్నమాట ఇంకా నా లెక్క ప్రకారం మూడు ఉన్నాయి" అంటూ మా ఆవిడ ఒకసారి సంబర పడి, వెంటనే నిట్టూర్చిన సంగతి నాకింకా బాగా జ్ఞాపకం ఉంది.

"మైసూరుపాక్ గడ్డిలోనూ, గోనె గుడ్డలోనూ పాక్ చేస్తారేమిటి? మీరు మరీ చెపుతారు" అంటూ నాకేసి చురచురా చూసి, "ఒక రూపాయి రిక్షావాడి కివ్వండి" అంటూ గోనెపాకెట్ పట్టించుకొని లోనికి వెళ్ళిపో యింది. ఇది మా ఆవిడకు ప్రతిసారీ అలవాటే. పుట్టింటికి వెళ్ళేటప్పుడు ఇరవై రూపాయలిచ్చినా, అరవై రూపాయలిచ్చినా, అఖరుకు రిక్షాకు రూపాయి నేనివ్వాల్సిందే.

నేను లోనికి వెళ్ళేసరికి బట్టలైనా మార్చుకోకుండా గోనె గుడ్డల్ని ఊడదీస్తూంది మా ఆవిడ. "ఏమిటే అది?" అన్నాను ఆత్రత చంపు కోలేక.

"ఆ చాకు ఇలా పడెయ్యండి, విప్పుతాను- మీరే చూద్దురుగాని. తినబోతూ రుచులెందుకు?" అంది.

"చంపేవు! అయితే, అది తినేవస్తువేనన్నమాట." అంటూ టేబిలు మీద చాకు అందించాను.

"జాతీయాలుకూడా మీకు అర్థంకావు తెలుగులో కథలు మటుకు తెగరాసేస్తున్నారు. హుఁ. పాఠకుల ఖర్మ!" అంటూ మొత్తుకుంది.

అయిదు నిమిషాలు కు స్తీపట్టి తాళ్ళు తెగకోసి గోనెగుడ్డ ఊడ పెరికి చుట్టూ సర్దిన గడ్డి తొలగించింది.

"చూశారా?" అంటూ నా వంక గర్వంగా చూసింది.

అది అద్దం!

సుమారు అడుగున్నరపొడవూ, అంతే వెడల్పూ ఉన్న అద్దం! నాలుగు ప్రైపులా అరచేతి వెడల్పున మందమయిన చెక్క ఫ్రేము వుంది. ఫ్రేముకి పాలిపోయిన ఆకుపచ్చరంగు. మోటుగా ఉంది! అద్దం మాత్రం ఎక్కడా కళాయి చెడకుండా నిగనిగలాడుతూంది. గోడకు తగల్చటానికి మాఆవిడ చెవులకున్నంత ఇనుప రింగులు రెండు దృఢంగా ఉన్నాయి. ఇంతకు ముందు వ్రేలాడదీసిన పాత చేంతాడు కూడా ఆ రింగులకే కట్టి ఉంది.

"ఇదేమిటే ?" అన్నాను ఆశ్చర్యంగా మహాలక్ష్మివంకచూస్తూ.

అడిగిన అరక్షణంలోనే అర్థమయింది నా ప్రశ్న చచ్చు ప్రశ్న అని!

"అద్దం!" అంది క్లుప్తంగా చి.సౌ., క్రిందపడిన గడ్డిపరకల్ని పోగు చేస్తూ.

"అదిసరే, అద్దం కనిపిస్తూనేఉంది...."

"కనిపిస్తుందికాబట్టే దాన్ని అద్దం అంటారు" అంటూ నా వంక అనుమానంగా చూస్తూ, "ఇలా మాట్లాడుతున్నా రేమిటి. ఖర్మ! నేను రెండులోజులు లేకపోతే మీ ఆరోగ్యం బాగుండదు. కొంపదీసి మళ్ళీ రంగారావు వచ్చాడేమిటి?" అంది. నామిత్రుడు రంగారావూ నేనూకలసి మా

ఆవిడ ఊర్లో లేనప్పుడు పందు కొట్టేసిన ఉదంతం ఈమధ్యనే మా ఆవిడకు తెలిసిపోయింది.

"బోడిజోకు వెయ్యక, ఈ అద్దం ఎక్కడిదో చెప్పు" అన్నాను. పురుష సహజమయిన గంభీరస్వరాన్ని తెచ్చి పెట్టుకుంటూ.

"దీనికి చాలా పెద్దకథ ఉంది." అంటూ, అద్దంగూట్లో పెట్టి చెత్తంతా ఎత్తి అవతల పారబోసింది!

"కుక్కర్‌లో నాలుగు మెతుకులు వండాను ముందుఅన్నం వడ్డించు తరువాత కథ చెబుదువుగాని" అన్నాను!

భోజనం చేస్తున్నప్పుడు, పూర్తిఅయిన తరవాత ఆ అద్దం కథ క్లుప్తంగా వివరించింది మా ఆవిడ. దాని సారాంశం ఇది: క్రీస్తుశకం ఇరవయ్యో శతాబ్దం మొదటి భాగంలో అప్పన్న అవధానిగారు ఆ అద్దాన్ని వాడేవారట! ఆయన ముంజేతి కంకణాన్ని ఇందులోచూసుకొని సంతృప్తి చెందేవారట. తరవాత దాన్ని వీరిఏకయికపుత్రిక సుబ్బమ్మగారికి ఇచ్చారట సుబ్బమ్మగారు తన అత్తవారింటికి వెళ్ళటం: అర్ధాంతరంగా ముండమోసి తన తమ్ముడి దగ్గరకుపోతూ దీన్నికూడా తీసుకుపోవడం జరిగింది. ఆమె తమ్ముడు రాయప్ప మనమరాలే మాఅత్తగారు. ఆమె ఇంతకాలం దాన్ని వారి స్వగ్రామంలో మిద్దె ఇంట్లో అటకపైన దాచిపెట్టారుట! మొన్న కొంపలు కాలిపోయినప్పుడు సామానులన్నీ అక్కడినుంచి తరలించి తెచ్చుకున్నారట. మా ఆవిడవాటాగా అందాకా ఈ అద్దాన్ని తీసుకెళ్ళమని ఇచ్చారట! అద్దమేకాకుండా ఇంకో ఉచిత సలహాకూడా ఇచ్చారట– "దాన్ని భద్రంగా వాడ"మని.

ఆ అద్దాన్ని చూస్తుంటే ఆ అద్దం చాలా పాతదనీ, దానికి ఇంతకంటే ఇంకఎక్కువ చరిత్రే ఉంటుందనీ సులువుగా గ్రహించుకోవచ్చును. ఇక్ష్వాకుకులతిలకుడు ఈ అద్దంలో చూసుకొంటూ తిలకం దిద్దుకుచేవాడు అన్నా ఆశ్చర్యపోనక్కరలేదు, రాణీ పద్మినీదేవిని ఈ అద్దంలోనే అత

దెవరికో చూపించారన్ని అబ్బురపడనవసరంలేదు. అంతపాతగా, మొద్దుగా కనిపిస్తూంది ఆ అద్దం.

భోజనంచేసి వచ్చాక అసలు గొడవ ప్రారంభమయింది.

'దీన్ని గోడకు వేళ్ళాడతీద్దాం!" అంది మా ఆవిడ.

నేను త్రుళ్ళిపడ్డాను! "దీన్నా! గోడకా! వీల్లేదుకాక వీల్లేదు" అంటూ అరిచాను.

"ఏం? ఎందుకని? మహాలక్ష్మి ఏడుపుమొహం పెట్టింది.

"మనకున్నది ఈ ఒక్కటేగది. దీని కున్నవి నాలుగే గోడలు. వాటిని కాస్తనీటుగా, నాగరికంగా ఉంచుకోవాలి. మనింటికి వచ్చే పోయే నలుగురూ కూర్చునేది ఇక్కడే కదా? అంత పాతఅద్దం ఈ గదిలో పెట్టడం నా కిష్టంలేదు!" అన్నాను.

అద్దం పాతదే కావచ్చు. కానీ దీన్ని మాఅమ్మ ప్రేమతో ఇచ్చింది. దీన్ని ఈ గదిలో తగిలిస్తాను!" అంది మా ఆవిడ.

"ఇక్కడొద్దు! వంటింట్లో తగిలించు" అన్నాను.

"వంటింట్లో పొగమూరి పోయిందంటే పాడయిపోతుంది!" అంటూ మూలిగింది.

చూడుమహాలక్ష్మి! ఈ నాలుగుగోడల్లోనూ చాలాభాగంకిటికీలక్రిందా ద్వారబంధాల క్రిందాపోయింది. మిగిలినభాగంలో ఏవో ఫొటోలుఉన్నాయి ఇదికూడా ఇక్కడ వేలాడదీస్తే గది ఇరుకుగా తయారవుతుంది. నామాట విను!" అంటూ సముదాయించాను. ముందు సముదాయింపబడినట్టే మొహం పెట్టింది. తరవాత గోడవంకచూపించి, "అదిగో ఆ ఫొటోతీసేసి ఇది తగిలిద్దాం!" అంది.

"ఏమిటి? ఆ ఫొటోతీసేస్తావా? అది ఎవరిదనుకున్నావ్! రవీంద్రనాథ్ ఠాగూర్‌దే! నేను చచ్చినా ఆ ఫొటో తియ్యనివ్వను! అద్దంలో నీ మొహం చూసుకోవడం కంటె తెల్లారిలేచి ఆ మహాకవి మొహం చూస్తే

నోబెల్ ప్రయిజ్ రాకపోయినా, కనీసం అకాడమీ ప్రైజయినా వస్తుంది" అన్నాను ఆవేశంగా.

"అవునులెండి. మన అకాడమీలు అలాగే తయారయ్యాయి! మీకు ప్రైజు ఇచ్చినా ఆశ్చర్యపోనక్కరలేదు. ముందు ఈ అద్దం సంగతి తేల్చండి" అంది నిరసనగా.

ఎలాగూ అద్దం గోడకు తగల్చటం తప్పేటట్లు లేదు. "అదిగో! ఆ వేంకటేశ్వరస్వామి పటము తీసెయ్యి! అక్కడ దీన్ని తగిలిదాం" అన్నాను.

"అపచారం! అపచారం! లెంపలేసుకోండి" అంటూ స్వామిఫోటో వంక తిరిగి దండాలు పెట్టింది. మొత్తానికి గోడమీది వస్తువులలో కొన్ని తియ్యటానికినేను, మరికొన్ని తియ్యటానికి మాఆవిడా ఒప్పుకోలేదు. ఆఖరికి సమస్య మరునాటికి వాయిదా వేశాం.

* * * *

మరుసటిదినం నేను ఆఫీసును డి తిరిగి వచ్చేవేళకు మా ఆవిడ చిరునవ్వుతో ఎదురువచ్చింది.

"చూశారా! మీరు వస్తున్నట్టు కనిపెట్టేశాను!" అంది.

వరండాదాటి గదిలోపల అడుగుపెట్టేసరికి నాకు అసలు సంగతి అర్థమయిపోయింది. ద్వారానికి ఎదురుగా అవతలిగోడకు అద్దం వాలుగా బిగింపబడి ఉంది. వాసంమేకు గోడలో దిగేసి,కొత్తచేంతాడుతో భద్రంగా అద్దాన్ని వేలాడగట్టింది. టెంపరరి వర్కులాకాకుండా బహు పెర్మనెంటు పనిలాగే కనిపించింది.

గదిలో ఒకవారగా కూర్చుని అద్దంలోకిచూస్తే అవతలి సంగతులన్నీ కనిపించేస్తాయి. వీధి ద్వారానికి ఎదురుగా, కాస్త ఎడంగా ఉండటం వలన వీధిలో సంగతులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మా ఆవిడ ఇంజనీరింగ్ స్కిల్‌ని మనసులోనే మెచ్చుకొన్నాను. కాని, అంతలోనే అసలు చీకాకు అర్థమయింది.

మా ఆవిడ నేను వస్తున్నట్లు ఎలా కనిపెట్టేసిందో, మేము ఇంటి లో చేసే ప్రతిపనీ రోడ్డుమీద పోయేవాళ్ళకు అలాగే కనిపించే ప్రమాదం ఉంది. ఈ ఆలోచన రాగానే నాకు మతిపోయింది.

"అదాన్ని ఇక్కడ దిగ్గొట్టా వన్న మాట! హు!అన్నాను చిరాగ్గా.

"ఎందుకలా హు! హు! అంటూ వస్తూనే చికాకు పడతారు? ఈ కాఫీ తాగండి!" అంటూ కప్పు అందించింది:

"కొంపని రోడ్డుమీద పెడుతున్నావు!" అన్నాను కాఫీ తాగటం ముగించి.

మా ఆవిడ అర్థంకానట్లు నావంక చూసింది.

"నేను రోడ్డుమీద ఉండగానే వస్తున్నట్లు ఈ అద్దంలో చూసి కని పెట్టావు, అవునా ?" అన్నాను క్రాస్ ఎగ్జామిషను ఆరం భిస్తూ —

"అవును" అంది.

"అలాగే మన గదిలో ఏంచేస్తున్నామో అంతా రోడ్డుమీద వెళ్ళే వాళ్ళకు ఈ అద్దంలోంచి కనిపించదూ? అన్నాను అసలు పాయింటుకు వస్తూ.

" 'ఎ'అను వస్తువుకు 'బి'అను వస్తువు ఎంత దూరమో! 'బి' 'ఎ'కూడా అంతేదూరము కదా!" అంటూ నా తెలివితేటల్ని కూడా ప్రద ర్శించాను

"మా ఆవిడ వెంటనే "ఏదయినా వస్తువు నీటిలో మునిగినప్పుడు అది కోల్పోయినట్లగపడు భారము ఆ వస్తువుచేత తొలగింపబడిన నీటి భారమునకు సమానముకదా! కాని,నిజముగా ఆవస్తువుబరువునుకోల్పోదు. కోల్పోయినట్లగపడును. అంతే" అంది.

"ఇక లాభం లేదు. నాకు పిచ్చెత్తేటట్లుంది.

మా ఆవిడ కాకినాడ గర్ల్స్ పాలీటెక్నిక్‌లో ఒక ఏడాది సివిల్ ఇంజనీరింగ్ డిప్లమోకూడా వెలగబెట్టింది.

"అదికాదే! ఇప్పుడు ఈవార ఇలా కూర్చుని మనం వాదించుకుంటు న్నామా? ఇదంతా వీధిలో నిలబడి ఎవరయినా సినిమా చూసినట్లు చూస్తున్నను!" అన్నాను.

మా ఆవిడ గట్టిగా నవ్వేసింది. "మనకు అద్దం ఎంతదగ్గరో అద్ద మునకు మంమూ అంతే దగ్గర! వీధి అద్దమునకు ఎంత దూరమో, అద్దము నకు వీధీ అంతే దూరము! కాబట్టి దగ్గరగావున్న మనకు అద్దంలో అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. వీధిలో వాళ్ళకు స్పష్టముగా కనుపించవు" అంటూ విషయాన్ని తెలివిగా విశదపరిచింది మహాలక్ష్మి.

ఇక లాభము లేదని ఊరుకున్నాను.

అస్పష్టముగానయినా ఇంట్లో విషయాలు రోడ్డుమీద వాళ్ళకు కను పించటము సుతారమూ నాకు ఇష్టంలేదు.

వాదన ఆపి, ముఖము కడుక్కుని బట్టలు మార్చుకున్నాను.

దువ్వుకుందామని అద్దంలోకిచూస్తే నా నడుంమాత్రమే అందులో కనిపిస్తూంది. నాతల అద్దంలో కనబడాలంటే అదేదో ఆసనముచేసిన రీతి లో నడుమును వెనకకు విల్లులావంచి మోకాళ్ళురెండూ అదే కోణములో ముందుకు వంచి మెడ వంగకుండా నిటారుగా పెట్టి నిలబడితే తప్ప లాభము లేదు! తల దువ్వుకోవటానికి రోజూ ఇంత కసరత్తు చేస్తే ఇక ఆఫీసులో పనిచేసినట్టే!

మా ఆవిడ పొట్టిగనుక తనకు కనుపించేటట్లు అమర్చుకొంది. "ఇది చాలాఅన్యాయము మహాలక్ష్మి! అసలు నాకు తల కనిపించటంలేదు" అన్నాను.

"ఉంటేగా కనపడటానికి!" అంటూ పడీ పడీ నవ్వింది మా ఆవిడ.

చికాకుగా తల దువ్వేసుకుని బయటపడ్డాను ఇంట్లోంచి.

తరవాతరెండు రోజులు ఒక చిన్నఅద్దంలోచూసే దువ్వుకున్నాను. ఇంతలో ఒకరోజు రంగారావు మా ఇంటికొచ్చాడు.

"బ్రహ్మాండముగా ఉంది గురూ అద్దం ఏదయినా మ్యూజియంకి ఇచ్చెయ్య కూడదూ! బోలెడంత డబ్బిస్తారు!" అన్నాడు.

నాకు తల తీసేసినట్లయింది, తరవాతకూడా ఒకరిద్దరు ఫ్రెండ్సు అలాగే అద్దంమీద చెడ్డకామెంట్లు పాస్‌చేశారు. భాస్కర్రావు అద్దం కథ అంతా విని, "అత్తగారి ధర్మం అని పెద్ద ఎరుపురంగు అక్షరాలు ఫ్రేము మీద గాయించరాదూ!" అన్నాడు. ఆఖరికి అద్దం సంగతి ఆఫీసులోకూడా తెలిసిపోయింది. "ఏమిటోయ్! మీ ఆవిడ లేటెస్టు ఫాషనులో ఉన్న అద్దం ఏదో తెచ్చిందట?" అంటూ ఎగతాళి చేయటం ఆరంభించారు.

ఆఫీసునుంచి ఇంటికి వస్తూనే-"ఆ అద్దం తీసేస్తావా? తియ్యవా?" అన్నాను సీరియస్‌గా.

మా ఆవిడ నాకోపం పసిగట్టేసింది.

"తిసేస్తాను" అంది.

"ఇప్పుడే తీసెయ్య" అన్నాను—నా రొట్టెవిరిగి నేతిలో పడుతూందనే సంబరంతో.

"తీసేసి పాక్ చేస్తూ ంవుటాను. మీరు వెళ్ళి రిక్షా తీసుకురండి!"

"రిక్షా ఎందుకు?"

"మా ఇంటికి వెళ్ళిపోవటానికి! ప్రతి చిన్న విషయానికీ మీరింత అథారిటీ చెలాయిస్తూ ఉంటే నేనిక్కడ ఒక్క క్షణమయినా ఉండను. అద్దం, నేనూ ఇద్దరం వెళ్ళిపోతాము. వంకాయలవేపుడు, చారు చేశాను. రాత్రి నాలుగు మెతుకులు తినండి. రామమ్మ రాగానే అంట్లగిన్నెలు తోమించి వంటింట్లో పెట్టించండి. మీ ఆరోగ్యంజాగ్రత్త. రంగారావుతో కలిసి తాగకండి!" అంటూ ముక్కు ఎగబీల్చుకుంటూ అంపకం ప్రారంభించింది.

నేను నీరుకారిపోయాను!

మాట్లాడకుండా తువ్వాలు చుట్టబెట్టుకొని నూతి వద్దకు వెళ్ళి పోయాను.

ఆ మరుసటి దినం రాత్రి భోజనం చేశాక మా ఆవిడ మరో కొత్త విషయం చెప్పింది. "ఎదురింటిలో ఆంజనేయులు, పెళ్ళాముఈ వేళ గట్టిగా పోట్లాడుకొన్నారు" అని మహా సంబరపడిపోతూ చెప్పింది.

"ఆహా! వాళ్ళు దెబ్బలాడుకుంటే నీ కెందు కింత సంబరం?" అన్నాను కసురుతూ.

మా ఆవిడ మూతి ముడుచుకుంది.

"అయినా,వాళ్ళు దెబ్బలాడుకున్నట్లు నీకెలా తెలిసింది?"అన్నాను.

వాళ్ళ భార్యాభర్తలు ఎన్నడూ సాధారణంగా బయటకు రారు! గదిలోనే ఉంటారు.

"ఇదిగో ఈ వారకుర్చీలో కూర్చుని మన అద్దములో చూస్తే వాళ్ళ గదిలోని విషయాలన్నీ కనిపిస్తాయి. మాటలు సరిగా వినబడ వనుకోండి...."

ఆహా! ఇదేం సెవెన్‌టీఎమ్.ఎమ్. తెర,సిక్స్ ట్రాక్ స్టిరియోఫోనిక్ సౌండు సిస్టమ్ అనుకున్నావేమిటి? మాటలు కూడా వినబడితే ఇంక అదే పనిగా వంటమానేసి సినిమా చూసినట్లు చూస్తావు కాబోలు! ఇతరుల విషయాలు అలా చూడటం సభ్యతకాదు!" అన్నాను.

"వాళ్ళు మనకు కనిపించేలా పోట్లాడుకోవటం సభ్యతా, మనం చూడటం అసభ్యతానా?" అంది.

"నువ్వు ఇలా అద్దాలు బిగించి తొంగి చూస్తూ కూర్చుంటావని పాపం వాళ్ళకేం తెలుసు?" అన్నాను.

మా శ్రీమతి మాట్లాడలేదు.

ఈ విషయం మళ్ళీ కొత్త సమస్యను తెచ్చిపెట్టింది.

మా ఆవిడ ఇలాంటి విషయాలన్నీ చూసి నాతో చెబితే ఫరవాలేదు కాని ఇది ఇక్కడితో ఆగదని నాకు తెలసు, మా శ్రీమతి నోట్లో నువ్వు

గింజ నానదు. కనీసం ఈ విషయాన్ని ఇద్దరికయినా చెపుతుంది- అడిగిన వాళ్ళకి,అడగని వాళ్ళకు!

నాదాకా ఈ సంగతి వచ్చేలోగా పక్కింటి పుల్లమ్మకీ, వెనకింటి విశాలమ్మకీ, ఇంకా వీధి చివరి వరకూ ఈ విషయం వెళ్ళిపోయే ఉంటుంది.

ఇలాటి విషయాలు మా ఆవిడద్వారా ప్రచారం కావటం నా కిష్టం లేదు. ఈ అద్దం నా కో పీడలా తయారయింది!

దాన్ని తీయించేస్తేగానీ నాకు మనశ్శాంతి లభించదు.

నిద్ర పట్టబోయే సమయానికి మెరుపులా ఒక ఆలోచన స్ఫురించింది.

ఆ ఆలోచన వచ్చాక హాయిగా నిద్రపట్టింది.

మరునాడు ఉదయం కాఫీ తాగుతూ అన్నాను: "ఎదురింటి ఆంజనేయులి పెళ్ళానికి బొత్తిగా సిగ్గులేదు!"

మా ఆవిడ కొంత సేపు నావంక ఆశ్చర్యంగా చూసింది.

నా ముఖంలోని భావాలు తెలియనీయకుండా పేపరు అడ్డం పెట్టుకున్నాను.

"ఎదురింటి వాళ్ళ పెర్సనల్ విషయాల గురించి మాట్లాడటం సభ్యత కాదని నిన్ననే నాకు బోధించారు కదా!" అంది గర్వంగా ముఖం పెట్టి.

"అవుననుకో! మరీ అంత అన్యాయంగాఉంటే ఎలా? కిటికీతలుపు లయినా మూసుకోకుండా బట్టలు మార్చుంకుటోంది! ఈ అద్దంలో ఆ దృశ్యం చూడలేకపోయాననుకో!" అని మాట్లాడటంముగించి పేపరుచదువు కుంటున్నట్లు అభినయించ సాగాను.

మా ఆవిడ సమాధానం చెప్పలేదు. కాఫీ కప్పు తీసుకొని లోనికి వెళ్ళిపోయింది.

"ఆఫీసు టైమవుతోంది; భోజనానికి లేవండి" అంది ఇంకో గంట పోయిన తరవాత.

భోజనం చేస్తూ అన్నాను: "ఆంజనేయులు పెళ్ళాం ఈ ఊరువచ్చినప్పుడు బాగా నల్లగా ఉండేది కదూ? ఈఊరి నీళ్ళు పడ్డట్టున్నాయి. కాస్త తెల్లబడి నవనవలాడుతోంది!" అన్నాను

మా ఆవిడ ఆమాటలు తనకు వినిపించనట్లు- "ఇంకొంచెం చారు వేసుకోండి" అంటూ మరికాస్త చారు ఒంపేసింది.

భోజనం ముగించి ఆఫీసుకి బయలుదేరాను.
మా ఆవిడ ముక్తసరిగా వీడ్కోలిచ్చింది!

* * *

సాయంకాలం ఆఫీసునుండి తిరిగి వచ్చేసరికి గోడకు అద్దం లేదు, నేను అనుకున్నట్లుగానే!

(ఆంధ్రప్రభ 2-10-74)